www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 15 జూన్ 2025 · 5 · ఏలూరు



కొనసాగిన డిఎస్సి పరీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉపాధ్యాయ నియామక పరీక్షలు మెగా డిఎస్సి - 2025 శనివారం ఏలూరులో ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ సిఆర్రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన పరీక్షకు మొత్తం 205 మందికి గాను 174 మంది హాజరు కాగా 31 మంది గైర్హాజరయ్యారు.

సిద్ధార్థ క్వెస్ట్ పాఠశాలలో 180 మందికి 167 మంది హాజరు కాగా 13 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 385 మందికి 341 మంది హాజరు కాగా 44 మంది గైర్హాజరయ్యారు. ఏలూరు ఇంజినీరింగ్ కళాశాలలో ఉదయం ఎలాంటి పరీక్షలూ జరగలేదు. అలాగే మధ్యాహ్నం కూడా పరీక్షలు మూడు కేంద్రాల్లో జరగలేదు.

పరిశ్రమల స్థాపన, ఉద్యోగాల కల్పనే లక్ష్యం..



ఏడాది పాలనపై చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్ కుమార్

- జిల్లాలో మొట్టమొదటిగా ఎంఎస్ఎంఇ పార్క్ నియోజకవర్గంలోనే ఏర్పాటు
- ఏడాదిలో సంక్షేమానికి రూ.170 కోట్లు, అభివృద్ధికి రూ.180 కోట్లు ఖర్చు
- వచ్చే అక్టోబర్ నాటికి చింతలపూడిలో వంద పడకల ఆసుపత్రి పూర్తి
- ప్రజా సమస్యలపై ప్రతి శుక్రవారం ఉదయమూ గ్రీవెన్స్, రాత్రి పల్లెనిద్ర
- చింతలపూడి ఎత్తిపోతల రైతులకు మేలు చేసేలా ముందుకు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

చింతపూడి నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసి ఇక్కడి ప్రజలకు ఉద్యోగావకాశాలు కల్పించాలనే లక్ష్యంతో పాటు నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్నట్లు చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్కుమార్ తెలిపారు. ఏడాది పాలనలో సంక్షేమం, అభివృద్ధి పరంగా అనేక చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఎంఎల్ఎగా బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన పలు విషయాలు వివరించారు. ఏడాది పాలనలో నియోజకవర్గంలో సంక్షేమానికి, అభివృద్ధికి ఎంత ఖర్చుపెట్టింది, రోడ్ల పనులకు నిధులు ఎన్ని వచ్చాయి, దేవాలయాలు, ఇరిగేషన్కు పనులకు సంబంధించి ఏవిధమైన పనులు జరిగాయి, పరిశ్రమల ఏర్పాటుకు చేస్తున్న కృషి, చింతలపూడి నగర అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు, చింతలపూడి ఎత్తిపోతల పథకం రైతులకు న్యాయం జరిగేవిధంగా ఏవిధంగా ముందుకు సాగుతున్నారో ఆయన వివరించారు. ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన పిలుపు అందుకుని వారంలో ఒకరోజు పల్లెనిద్ర, గ్రీవెన్స్ నిర్వహిస్తుండడం వంటి అనేక అంశాలను ఎంఎల్ఎ 'ప్రజాశక్తి'కి తెలిపారు.

ప్రశ్న : ఎంఎల్ఎగా ఏడాది పాలన పూర్తిచేసుకున్నారు, ఈ కాలంలో ఏవిధంగా పాలన ముందుకు సాగింది?

ఎంఎల్ఎ: ఏడాది పాలన సంతృప్తికరంగా సాగింది. ఈ కాలంలో రూ.170 కోట్లు సంక్షేమానికి, రూ.180 కోట్లు అభివృద్ధికి ఖర్చు చేయడం జరిగింది. చింతలపూడి నగరంలో రూ.50 కోట్లతో ఇంటర్నల్ రోడ్లు, చెరువుల బాగుచేత, డ్రెయినేజీ, తాగునీటి పనులకు సంబంధించి ఖర్చు చేయడం జరిగింది. జంగారెడ్డిగూడెంలో రూ.42 కోట్లు వివిధ అభివృద్ధి పనులకు ఖర్చుచేశాం. ఎన్ఆర్ఇజిఎస్ కింద రూ.25 కోట్లు సీసీ రోడ్లుకు ఖర్చుచేయడం జరిగింది. ఎన్ఆర్ఇజిఎస్ రెండో విడతగా మరో రూ. ఆరుకోట్లు నిధులు రానున్నాయి. నాబార్డ్ నిధులు రూ.25 కోట్లతో జలపావారిగూడెం, జీలకర్రమెట్ట ఇతర రోడ్లు పనులు జరుగుతున్నాయి. చింతలపూడి పట్టణంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశాం. ఆర్అండ్బి రోడ్లకు రూ.50 కోట్ల నిధులు ఖర్చు చేయనున్నాం. సి కేటగిరి టెండర్లు సైతం పూర్తయ్యాయి. సిఎంఆర్ఎఫ్ (సిఎం రిలీఫ్ ఫండ్) కింద రూ.4 కోట్లు అందించాం. నవోదయం-2 పేరుతో సారా నిషేధం విజయవంతంగా సాగుతోంది.

ప్రశ్న : చింతలపూడి ప్రజలు చిరకాల కోరిక వంద పడకల ఆసుపత్రి పనులు ఎక్కడి వరకూ వచ్చాయి?

ఎంఎల్ఎ : ఈ ఏడాదిలో రూ.నాలుగు కోట్ల నిధులు ఆసుపత్రి పనులకు మంజూరు చేయడం జరిగింది. మరో 20 శాతం పనులు మాత్రమే ఉన్నాయి. వచ్చే సెప్టెంబర్, అక్టోబర్కు పూర్తిచేస్తాం. త్వరలోనే ఆసుపత్రిని ప్రజలకు అందుబాటులోకి తెచ్చేలా చర్యలు చేపడతున్నాం.

ప్రశ్న : ఇరిగేషన్ పనులకు సంబంధించి నిధులు ఖర్చు పెట్టారా?

ఎంఎల్ఎ : ఇరిగేషన్ సెక్టార్లో ఒఅండ్ఎం పనుల కింద రూ.2 కోట్లు ఖర్చు చేయడం జరిగింది. కామవరపుకోట, చింతలపూడి ఇతర ప్రాంతాల్లో దేవాలయాల అభివృద్ధికి రూ.రెండు కోట్లు వచ్చాయి. వ్యవసాయానికి తొమ్మిది గంటలు, గృహాలకు 24 గంటల విద్యుత్ అందించేలా ఆర్డిఎస్ నిధులు రూ.270 పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే 25 శాతం పూర్తయ్యాయి.

ప్రశ్న : లోఓల్టేజీ సమస్య పరిష్కరించేందుకు విద్యుత్ సబ్స్టేషన్ల ఏర్పాటుకు ఏమైనా చర్యలు తీసుకున్నారా?

ఎంఎల్ఎ : కొత్తగా ఆరు సబ్స్టేషన్ ఏర్పాట్లకు సంబంధించి ప్రతిపాదనలు పంపించాం. అనుమతులు వచ్చాక పనులు ప్రారంభించడం జరుగుతోంది. తడికలపూడిలో సూర్యఘర్ ఏర్పాటు జరుగుతోంది.

ప్రశ్న: పరిశ్రమల ఏర్పాటుకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎంఎల్ఎ: జిల్లాలో మొట్టమొదటిగా చింతలపూడి నియోజకవర్గంలో 70 ఎకరాల్లో ఎంఎస్ఎంఇ (మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్ప్రైజెస్) పార్క్ ఏర్పాటు చేయడం జరిగింది. మెట్ట ప్రాంతంలో కోకో పంటను ఎక్కువగా రైతులు పండిస్తున్నారు. కోకో సంబంధించి ఆది నుంచి చివరి వరకూ ప్రోసెసింగ్ పనులు ఇక్కడే జరిగేలా పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు కొనసాగుతున్నాయి. ఇంకా అనేక పరిశ్రమల ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. పరిశ్రమల ఏర్పాటు, ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం.

ప్రశ్న: సంక్షేమ హాస్టల్స్పై ఏమైనా దృష్టి సారించారా?

ఎంఎల్ఎ : సంక్షేమ హాస్టళ్ల అభివృద్ధికి సంబంధించిన రూ.రెండున్నర కోట్లు ఖర్చుపెడుతున్నాం. చింతలపూడి గురుకుల పాఠశాలలో సమస్యను పరిష్కరిస్తాం.

ప్రశ్న: చింతలపూడి ఎత్తిపోతల పథకం ఎప్పటికి పూర్తవుతుంది. భూములిచ్చిన రైతులకు న్యాయం జరిగేవిధంగా చర్యలు తీసుకున్నారా?

ఎంఎల్ఎ : రెండున్నర ఏళ్లలో చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేసేలా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. చింతలపూడి పథకంపై ఎన్జిటిలో కేసు ఉండడంతో ఇబ్బంది ఉంది. భూములిచ్చిన రైతులకు న్యాయం జరిగేవిధంగా అన్ని చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: జంగారెడ్డిగూడెంలో బైనేరు వాగుపై వంతెన నిర్మాణం పరిస్థితి ఏమిటి?

ఎంఎల్ఎ : నియోజకవర్గంలో మొత్తం మూడు వంతెనల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నాం. కళ్లచెరువు, పట్టిన పాలెం, బైనేరుపై వంతెన నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాం.

ప్రశ్న : ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ఏ విధంగా ముందుకు సాగుతున్నారు?

ఎంఎల్ఎ : ప్రతి శుక్రవారం కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించి ఫిర్యాదులు స్వీకరిస్తున్నాం. అదేరోజు రాత్రి గ్రామాల్లో పల్లె నిద్ర చేస్తున్నాం. సిఎం చంద్రబాబు పిలుపును అందుకుని ప్రజల వద్దకు వెళ్తున్నాం. ఇప్పటికే నాలుగు పల్లె నిద్రలు చేశాం. జనాలకు మరింత చేరువయ్యేలా ముందుకు సాగుతాం.

ప్రశ్న : కూటమి నేతల సహకారం ఏవిధంగా ఉంది?

ఎంఎల్ఎ : కూటమి నేతల సహకారం అన్నివిధాలా బాగుంది. ఎటువంటి ఇబ్బందీ లేదు. అందరం కలిసి అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లేలా పనిచేస్తున్నాం.

'తల్లికి వందనం'లో కోత.. ప్రజలకు వాత..!

- రూ.15 వేలు ఇస్తామని రూ.13 వేలు అందిస్తూ మోసం చేస్తున్న ప్రభుత్వం
- పథకం అమల్లో సవాలక్ష నిబంధనలు
- పాఠశాల అభివృద్ధి పేరిట రూ.2 వేలు మినహాయింపు
- వైసిపి ప్రభుత్వం విధానాలే కూటమి కొనసాగింపు
- ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు

ప్రజాశక్తి - భీమవరం

ప్రతి విద్యార్థికీ రూ.15 వేలు అని గొప్పలు చెప్పిన కూటమి ప్రభుత్వం తల్లికి వందనంలో కోతలు పెట్టడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అందించే అరకొర సొమ్ముకు కూడా సవాలక్ష నిబంధనలు విధించి అర్హులను అనర్హులుగా గుర్తిస్తున్నారంటూ ఆరోపణలు వెల్లి వెత్తుతున్నాయి. పిల్లల చదువులకు తల్లికి వందనం సాయం ఆసరాగా ఉంటుందని భావించిన తల్లిదండ్రులకు నిరాశే ఎదురైంది. ఫీజులు, పుస్తకాలు, విద్యా సామాగ్రికి వేల రూపాయలు చెల్లించలేక ఆందోళన చెందుతున్నారు. చెప్పిన దానికి చేస్తున్న దానికి పొంతన లేకపోవడంతో కూటమి ప్రభుత్వంపై ప్రజానీకం గుర్రుగా ఉన్నారు.

కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాల్లో తల్లికివందనం ప్రధానమైంది. ఈ పథకం అమలుపై ఏడాదిగా అనేక అనుమానాలు వ్యక్తమైనప్పటికీ కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పండుగలో భాగంగా ఎట్టకేలకు ఈ పథకాన్ని తెరపైకి తీసుకొచ్చి అమలు చేసేందుకు చర్యలు తీసుకుంది. అయితే ఈ పథకం తల్లులకు అక్కరకు చేరకుండా సవాలక్ష నిబంధనలు విధించింది. గత వైసిపి ప్రభుత్వం అమ్మఒడికి పెట్టిన నిబంధనలకు మించి కూటమి ప్రభుత్వం మరికొన్ని జోడించి అర్హులను తగ్గించేందుకు చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో వైసిపి, సిపిఎంతో పాటు విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థుల తల్లిదండ్రులు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 1,76,574 మంది విద్యార్థులను అర్హులుగా గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. మొత్తం 1,16,182 తల్లులకు దీనికి సంబంధించి ఆర్థిక సాయం వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు అర్హుల జాబితాలను సచివాలయాలకు విడుదల చేశారు. వీటిపై అభ్యంతరాలుంటే ఈ నెల 26వ తేదీలోపు సచివాలయాల విద్యా కార్యదర్శులకు తెలియజేయొచ్చు. శుక్రవారం, శనివారం బ్యాంకుల వారీగా పలు విడతల్లో లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమైనట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. అయితే విద్యార్థుల తల్లిదండ్రుల బ్యాంకు ఖాతాల్లో పాఠశాలలు తెరిచేనాటికి రూ.15 వేలు చొప్పున ఎంతమంది పిల్లలుంటే అందరికీ జమ చేస్తామని ప్రభుత్వం చెప్పింది. గత ప్రభుత్వం అమ్మఒడికి అమలు చేసిన నిబంధనలే కూటమి ప్రభుత్వం కూడా అమలు చేసేలా ఆదేశాలిచ్చింది. ఈ పథకానికి సంబంధించి రాష్ట్ర స్థాయిలో ఒక ఖాతాకు నిధులు కేటాయిస్తూ విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నిధులు జమ చేసేందుకు పలు మార్గదర్శకాలను రూపొందిస్తూ జిఒ 26ను ప్రభుత్వం విడుదల చేసింది. 2020 జనవరిలో ఒక్కో విద్యార్థికి రూ.14 వేలు, ఆ తర్వాత మూడేళ్లు రూ.13 వేలు చొప్పున ఇవ్వగా కూటమి ప్రభుత్వం దీన్నే ప్రమాణికంగా తీసుకుని ఒక్కో విద్యార్థికి రూ.13 వేలు జమ చేసేందుకు ఉత్తర్వులిచ్చింది. కేటాయించిన రూ.15 వేలల్లో రూ.2 వేలు పాఠశాల అభివృద్ధి పేరిట కోత విధించారు. అయితే జాబితాలో అర్హులను అనర్హులుగా చూపించారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. అయితే ప్రయివేట్ విద్యాసంస్థల్లో లక్షల రూపాయలు ఫీజుల వసూలు చేస్తున్నప్పటికీ అభివృద్ధి పేరుతో అక్కడ కూడా రూ.2 వేలు కోత విధించడం పట్ల విమర్శలు వెల్లివెత్తుతున్నాయి. ఫీజుల రూపంలో విద్యార్థుల తల్లిదండ్రుల రక్తం పీల్చుతున్న ప్రయివేట్ విద్యాసంస్థలకు ఇది వర్తింపచేయడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉంటే స్కీం వర్కర్లు, కాంట్రాక్టు కార్మికులు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు సైతం తల్లికి వందనం వర్తింపచేయకపోవడంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సవా లక్ష నిబంధనలతో సతమతం..

ప్రస్తుత విద్యా సంవత్సరంలో 75 శాతం హాజరు ఉన్న వారికి వచ్చే విద్యా సంవత్సరంలో ఈ పథకానికి అర్హులుగా పరిగణిస్తారు. రేషన్ కార్డు ఉండాలి. ప్రిన్సిపల్, హెచ్ఎంలు విద్యార్థుల వివరాలు నమోదు చేయాలి. కుటుంబ ఆదాయం నెలకు గ్రామాల్లో రూ.10 వేలు, పట్టణాల్లో రూ.12 వేలు మించి ఉండరాదు. పట్టణాల్లో 1000 చదరపు అడుగులకు మించిన విస్తీర్ణంలో ఇల్లు ఉండకూడదు. విద్యా హక్కు చట్టం కింద ప్రయివేటు స్కూళ్లలో అడ్మిషన్లు పొందిన వారికి సొమ్ము పూర్తిగా ఇవ్వరు. ఆయా స్కూళ్ల మేనేజ్మెంట్లకు చెల్లించాల్సిన ఫీజులు ఈ సొమ్ము నుంచి మినహాయించి, మిగతావి లబ్ధిదారుల తల్లులకు అందజేస్తారు. కేంద్ర ప్రాయోజిత పథకాల కింద పోస్ట్, ప్రీ స్కాలర్షిప్లు పొందుతున్న వారికి స్కాలర్షిప్ అమౌంట్ పోను మిగతావి ఇస్తారు. ఫోర్ వీలర్ ఉండకూడదు. టాక్సీ, ఆటో, ట్రాక్టర్లను మినహాయించారు. కరెంట్ వినియోగం 300 యూనిట్లకు మించరాదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగస్తులకు, పది వేలకు పైన పెన్షన్ వచ్చే వారికి పథకం వర్తించదు. ఈ నిబంధన నుంచి మున్సిపల్ వర్కర్లను మినహాయించారు. ఈ నిబంధనలతో తల్లిదండ్రులు సతమతమవుతున్నారు.

వేల కుటుంబాలకు అన్యాయం..



జెఎన్వి.గోపాలన్, సిపిఎం పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి, భీమవరం

అడ్డగోలు నిబంధనల కారణంగా వేల కుటుంబాలకు అన్యాయం జరిగే అవకాశం ఉంది. ఆదాయంతో నిమిత్తం లేకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే వారందరికీ పథకాన్ని ఇవ్వాలి. ఈ విద్యా సంవత్సరం ఒకటో తరగతిలో చేరే వారికి, ఇంటర్ పూర్తయిన వారికి తల్లికి వందనం నగదు చెల్లించాలి. స్కీమ్ వర్కర్లు, వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు కూడా ఈ పథకాన్ని వర్తింపజేయాలి.రూ.15 వేలు నేరుగా తల్లులకు చెల్లిస్తామని ఇప్పుడు రూ.2000 మినహాయిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం సరికాదు. ఫీజు రీయింబర్స్మెంట్ పొందుతున్న కుటుంబంలో విద్యార్థులకు ఈ పథకం అమలు కాకుండా మినహాయించడం హామీని ఉల్లంఘించడమే. ప్రయివేటు పాఠశాలల్లో లక్షల రూపాయలు ఫీజుల రూపంలో వసూలు చేస్తున్నారు. ప్రతి విద్యార్థికీ కోత లేకుండా రూ.15 వేలు అందించాలి.

జిల్లా వ్యాప్తంగా ఉద్యమిస్తాం..



టి.ప్రసాద్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, భీమవరం

ఎన్నికల్లో ప్రతి విద్యార్థికీ రూ.15 వేల ఇస్తామని చెప్పిన కూటమి ప్రభుతం పాఠశాల అభివృద్ధి పేరుతో రూ.2 వేల కోత పెట్టి పేద మధ్య తరగతి విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేసింది. ఇన్ని నిబంధనలు విధిస్తే అర్హుల కంటే అనర్హులే ఎక్కువగా ఉంటారు. కొంతమందికైతే సాంకేతిక సమస్యలని ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఎలాంటి షరతులూ లేకుండా తల్లికి వందనం పథకాన్ని వర్తింపజేసి రూ.15 వేలు ఇవ్వాలి. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఉద్యమిస్తాం.


పఠనాసక్తిని పెంపొందించడమే లక్ష్యం

జాయింట్ కలెక్టర్ జెసి ధాత్రిరెడ్డి

'ఏలూరు బుక్ నూక్స్' ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు

సమాజంలో పఠనాసక్తిని పెంపొందించడం, పుస్తకాల ద్వారా జ్ఞానాన్ని విస్తరించడం లక్ష్యంగా ఏలూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో ఏలూరు బుక్ నూక్స్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పుస్తక ప్రియులతో పాటు, కొత్తవారిలో కూడా పఠనాసక్తిని కలిగించేందుకు చేపట్టిన ఈ కార్యక్రమాన్ని మరింత విస్తరించనున్నట్లు జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. ఏలూరు బుక్ నూక్స్ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నూతన పుస్తక సేకరణ కార్యక్రమంతో పాటు, సరికొత్త వెబ్సైట్ https://elurubooknooks.comను శనివారం ఆవిష్కరించినట్లు వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రస్తుతమున్న మూడు కేంద్రాలకుగాను భవిష్యత్తులో వంద పుస్తక కేంద్రాలకు విస్తరించేందుకు ఏర్పాట్లు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. ఈ విస్తరణ ప్రణాళిక, అక్షరాస్యతను పెంపొందించడం, జ్ఞానాన్ని పంచుకోవడం ద్వారా సమాజంపై సానుకూల ప్రభావాన్ని చూపగలదని ఆమె అన్నారు. పుస్తక సేకరణ కార్యక్రమం ద్వారా పౌరులు తమ వద్ద ఉన్న పాత (మంచి స్థితిలో ఉన్నవి), కొత్త పుస్తకాలను ఈ కార్యక్రమానికి సమర్పించవచ్చని చెప్పారు. విద్యా సంబంధిత, సాహిత్య, విజ్ఞానదాయక, చారిత్రక, వ్యక్తిత్వ వికాస, స్ఫూర్తిదాయక కథలు, నవలలు, పిల్లల పుస్తకాలు వంటివి ప్రధానంగా సేకరిస్తారని చెప్పారు. సమాజంలోని అన్ని తరగతుల వారికి ఉపయోగపడే, జ్ఞానాన్ని పంచే పుస్తకాలు మాత్రమే తీసుకుంటా రన్నారు. ఈ కార్యక్రమానికి నగదు రూపంలో ఎలాంటి విరాళాలు స్వీకరించబోమని స్పష్టం చేశారు. కేవలం పుస్తక రూపంలో మాత్రమే విరాళా లను స్వీకరిస్తారని వివరించారు. దాతలు తమ సమీపంలోని పుస్తక సేకరణ కేంద్రాల వివరాలను కొత్తగా ప్రారంభించిన వెబ్సైట్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. సమీపంలోని బుక్ నూక్ కేంద్రాల వివరాలను సులభంగా తెలుసుకోవచ్చని, స్వచ్ఛందంగా సేవ చేయడానికి నమోదు చేసుకోవచ్చని తెలిపారు. సమాజంలోని ప్రతిఒక్కరూ పుస్తకాలను సమర్పించడంలో భాగస్వాములు కావాలని ఆమె కోరారు.



పొగాకు పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - టి.నర్సాపురం

రైతులు పండించిన పొగాకు పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. మండలంలోని అల్లూరి సీతారామరాజు నగర్లో శనివారం సిపిఎం నాయకులు అనుమోలు మురళీ అధ్యక్షతన సిపిఎం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి మడకం సుధారాణి ఆధ్వర్యంలో పలు సమస్యలపై చర్చించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న రవి మాట్లాడుతూ రైతాంగం పండించిన పొగాకు పంటను పొగాకు కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకెళితే తిప్పి పంపడంతోనే సరిపోతుందన్నారు. పంటను కొనుగోలు చేయకుండా సిండికేట్గా ఏర్పడి రైతులకు నష్టం చేకూర్చే విధంగా కొనుగోలు కేంద్రాల్లో దళారులు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కొన్ని లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టిన రైతులు పొగాకు కొనుగోళ్లు లేకపోవడం వల్ల ఆందోళనకు గురవుతున్నారని వాపోయారు. తక్షణం రాష్ట్ర ప్రభుత్వం కల్పించుకొని పొగాకు రైతు గిట్టుబాటు ధరలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు మడకం కుమారి, బరగడ కుమారి, ముంద్రు శిరీష, పలువురు మండల కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రవి

అనర్హుల జాబితాలో పేర్లు ఉంటే ఫిర్యాదు చేయండి

'తల్లికి వందనం'పై డిఇఒ ఎం.వెంకటలక్ష్మమ్మ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం విద్యను ప్రోత్సహించేందుకు చేపట్టిన తల్లికి వందనం పథకం 2025-26 సంవత్సరానికి సంబంధించి ప్రక్రియ కొనసాగుతోందనీ, తమ పిల్లల పేర్లు అనర్హుల జాబితాలో ఉన్న తల్లిదండ్రులు గ్రామ, వార్డు సచివాలయాలకు వెళ్లి సరి చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పథకానికి అర్హత పొందాలంటే నిర్దిష్ట ప్రమాణాలు ఉండాలని తెలిపారు. అనాథలు, వీధి బిడ్డలు వంటి ప్రత్యేక కేటగిరీల విద్యార్థులను కూడా అర్హులుగా పరిగణిస్తారని తెలిపారు. రైట్ టు ఎడ్యుకేషన్ యాక్ట్ ప్రకారం ప్రయివేట్ పాఠశాలల్లో చేర్పించిన విద్యార్థుల ఫీజును నేరుగా పాఠశాలకు చెల్లించి, మిగిలిన మొత్తం తల్లి ఖాతాలో జమ చేయనున్నట్లు తెలిపారు. ఈ పథకానికి సంబంధించి అర్హత లేని విద్యార్థుల జాబితాల్లో తమ పిల్లల పేర్లు ఉంటే తల్లిదండ్రులు మండల, గ్రామ, వార్డు సచివాలయాలకు వెళ్లి ఫిర్యాదు చేయాలని, సంబంధిత డేటా ఎంట్రీ ఆపరేటర్లు తక్షణమే ఎన్బిఎం పోర్టల్లో లాగిన్ అయి సర్వీస్ రిక్వెస్ట్ పెట్టాలని, ఇందుకోసం ప్రత్యేకంగా ఆప్షన్ను అందుబాటులోకి తెచ్చారని తెలిపారు. తాత్కాలికంగా సాంకేతిక కారణాల వల్ల అనర్హులుగా కనిపిస్తున్నవారి వివరాలను తప్పనిసరిగా ఆఫ్లైన్ రిజిస్టర్లో నమోదు చేయాలని, గ్రీవెన్స్ నమోదు చేసిన తర్వాత 6-అంచల వెరిఫికేషన్ ప్రక్రియ ద్వారా విద్యార్థి అర్హతపై స్పష్టత లభిస్తుందని తెలిపారు. జిల్లాలో విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్లు, మండల విద్యాధికారులపై పేర్కొన్న సూచనలను కచ్చితంగా పాటించాలని, తల్లిదండ్రులకు సరైన మార్గనిర్దేశం కల్పించాలని ఆదేశించారు. ఈ నెల 20వ తేదీ వరకు గ్రీవెన్స్లను పరిశీలించనున్నట్లు, ఈ నెల 21వ తేదీ నుంచి 28 వరకు తుది జాబితా రూపొందించనున్నట్లు తెలిపారు. జులై ఐదో తేదీన డబ్బు జమ చేయనున్నట్లు పేర్కొన్నారు. అనర్హుల జాబితాలో తమ పిల్లల పేర్లు ఉన్న తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

రేపు యథావిధిగా పిజిఆర్ఎస్

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజా ఫిర్యాదుల పరిష్కారాన్ని మరింత వేగవంతంగా, ప్రజల దృష్టికి మరింత చేరువ చేయడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) సేవలను సోమవారం మండల, డివిజనల్ మున్సిపల్ స్థాయిల్లో కూడా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. జిల్లా స్థాయిలో కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో ఈ నెల 16వ తేదీ సోమవారం ఉదయం పది గంటల నుంచి యథావిధిగా పిజిఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇంటి నుంచే ఆన్లైన్ ద్వారా ఫిర్యాదు చేసేందుకు ప్రభుత్వం అధికారిక వెబ్సైట్ https://meekosam.ap.gov.in ఏర్పాటు చేసిందని, ఫిర్యాదుల స్థితి తదితర సమాచారం తెలుసుకోవాలంటే 1100 టోల్ఫ్రీ నంబర్కు కాల్ చేయవచ్చని తెలిపారు. ఈ వ్యవస్థ వల్ల ప్రజల సమస్యలు తక్షణమే సంబంధిత అధికారులకు చేరి, సమయానుకూలంగా పరిష్కారమవుతాయని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు గుర్తించి పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలని తెలిపారు.

పోలవరంలో కేంద్ర జల సంఘ బృందం పర్యటన

డయాఫ్రంవాల్, బట్రస్ డ్యామ్ల నిర్మాణాల పరిశీలన

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ప్రాజెక్టులో డయాఫ్రంవాల్, బట్రస్ డ్యామ్ల నిర్మాణాలను కేంద్ర జల సంఘం బృందం శనివారం పరిశీలించింది. కేంద్ర జల సంఘం సభ్యుడు యోగేష్ పైథాంకర్ చీఫ్ ఇంజినీర్ హెచ్ఎస్. సెనేగర్, ప్రాజెక్టు అథారిటీ చీఫ్ ఇంజినీర్ రమేష్ కుమార్ బృందం ఉదయం పోలవరం ప్రాజెక్టు కార్యాలయానికి చేరుకున్నారు. తొలుత ప్రాజెక్టు కార్యాలయం సమీపంలో ఉన్న మోడల్ రూమ్లో ఉన్న ప్రాజెక్టు నమూనాను పరిశీలించారు. అనంతరం ప్రాజెక్టు నిర్మాణంలో సీపేజీ నివారణ కోసం నిర్మిస్తున్న బట్రస్ డ్యామ్ పనులు, డయాఫ్రంవాల్, గ్యాప్-1 నిర్మాణపు పనులు, ఎగువ, దిగువ కాపర్ డ్యామ్లు స్పిల్ వే ప్రాంతాలను, కాంక్రీట్ మిక్సింగ్ ల్యాబ్లను పరిశీలించింది. కేంద్ర జల సంఘం బృందానికి సిఇ కె.నరసింహమూర్తి, ఎస్ఇ రామచంద్రారెడ్డి, ఇఇలు బాలకృష్ణ, శ్రీనివాస్ సంబంధిత వివరాలను తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణంలో వేగవంతంగా జరుగుతున్న పనుల పట్ల కేంద్ర జల సంఘం బృందం సంతృప్తి వ్యక్తం చేసినట్లు ఇఇ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా నిర్దేశిత లక్ష్యం మేరకు ప్రాజెక్టు పనులు వేగవంతంగా జరిగేలా చూడాలని అధికారులకు బృందం సూచించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో యుద్ధప్రాతిపదికన పనులు చేస్తున్నాయని జలవనరులశాఖ అధికారులు బృందానికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఇఇలు డి.శ్రీనివాస్, కె.బాలకృష్ణ, డిఇలు అనీల్కుమార్, శ్రీరామ్పటేల్, మల్లికార్జున్, ఎఇఇలు మల్లికార్జున్, అనీల్ కుమార్, పద్మకుమార్, సురేష్, అరుణ్, కుమారస్వామి, మెగా గత్తేదారులు మెగా కంపెనీ జిఎం గంగాధర్, డిజిఎం మురళి పమ్మి, పాండే, వెంకటేష్ పాల్గొన్నారు.



పోలవరంలో పర్యటిస్తున్న బృందం

యోగాతో ఒత్తిడి దూరం : కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

యోగాను మొక్కుబడిగా కాకుండా ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ఇష్టంగా చేయాలని, నిత్యం ఎన్నో ఒత్తిడుల మధ్య జీవిస్తుంటామని, వాటిని అధిగమించాలంటే యోగా తప్పనిసరని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. యోగాంధ్ర-2025 కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం ఏలూరు, వట్లూరు లోని టిటిడిసిలో సన్నద్ధక సామూహిక యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ కె.వెట్రిసెల్వితో పాటు పలువురు జిల్లా అధికారులు, ఉద్యోగులు యోగాసనాలు వేశారు. ప్రభుత్వ ప్రోటోకాల్ ప్రకారం యోగా శిక్షకులు యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పలు యోగాసనాలు వేసి అందరిని అబ్బురపరిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రోజు యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చన్నారు.


మహిళలకు రక్షణగా శక్తి యాప్



అవగాహన కల్పిస్తున్న శక్తి టీమ్

ప్రజాశక్తి - ఏలూరు

మహిళా భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన శక్తి యాప్పై ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ సుబ్బారావు ఆధ్వర్యంలో మహిళా అధికారులు ఏలూరులో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్పి ప్రతాప్శివకిషోర్ ఆదేశాల మేరకు ఇన్స్పెక్టర్ సుబ్బారావు ఆధ్వర్యంలో, ఎస్ఐ కాంతిప్రియ, సిబ్బంది పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో మహిళల భద్రత, సైబర్ క్రైమ్, డ్రగ్స్, ర్యాగింగ్ వంటి అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో మహిళలు తక్షణ సహాయం కోసం 112 లేదా 7993485111 (శక్తి) నెంబర్కు కాల్ చేయవచ్చన్నారు. ప్రతి మహిళా తమ మొబైల్లో శక్తి యాప్ను డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. ఈ యాప్ ద్వారా అత్యవసర సమయంలో కేవలం ఒకే క్లిక్తో సహాయం కోరవచ్చన్నారు. యాప్ ద్వారా లొకేషన్ ట్రాకింగ్, ఎస్ఒఎస్ అలర్ట్, తక్షణ పోలీస్ సహాయం అందుతాయన్నారు. ఉమెన్ డ్రాప్ ఎట్ హోమ్ వాహన సదుపాయం రాత్రి పది గంటల నుంచి ఉదయం ఐదు గంటల వరకు ఒంటరిగా ప్రయాణించే మహిళల కోసం అందుబాటులో ఉంటుందన్నారు. కళాశాలల్లో ర్యాగింగ్ పూర్తిగా నిషేధమని, ర్యాగింగ్కు పాల్పడిన వారికి కఠిన శిక్షలు పడతాయని చెప్పారు. బాధితులు వెంటనే కళాశాల అధికారులకు తెలియజేయాలన్నారు. డ్రగ్స్ వాడకం, ఆన్లైన్ గేమ్స్ వల్ల మహిళలు దారి తప్పే ప్రమాదం ఉందన్నారు. అవసరమైతే కౌన్సెలింగ్ సెంటర్ల సహాయం తీసుకోవాలన్నారు. సైబర్ మోసాలు జరిగినప్పుడు వెంటనే 1930 నెంబర్కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. వ్యక్తిగత డేటా, డబ్బు భద్రతకు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ఏలూరులో మహిళల భద్రత కోసం వన్స్టాప్ సెంటర్, భూమిక ఉమెన్స్ కలెక్టివ్ సెంటర్ వంటి సేవలు కూడా అందుబాటులో ఉన్నాయని మహిళా పోలీస్ స్టేషన్ వారు తెలిపారు. మహిళలు, కుటుంబ సభ్యులు పోలీస్ సిబ్బంది సేవలను వినియోగించుకుని సురక్షితంగా ఉండాలని చెప్పారు.


సైకిళ్లు అందిస్తున్న మంత్రి పార్థసారథి

విద్యుత్ సైకిళ్లు అందజేత

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. నూజివీడులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో శనివారం పది మంది విభిన్న ప్రతిభావంతులకు విద్యుత్ సైకిల్స్‌ను మంత్రి అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సంక్షేమ కార్యక్రమాలను పూర్తిస్థాయిలో అమలు చేస్తున్న ఘనత తమ ప్రభుత్వానికి దక్కుతుందని తెలిపారు.

నిందితులకు శిక్ష పడేలా చర్యలు

ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్


మాట్లాడుతున్న ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్

కేసుల్లో నిందితులుగా ఉన్న ప్రతి ఒక్కరికీ శిక్ష పడేవిధంగా చర్యలు చేపట్టి చట్టాన్ని పరిరక్షించే విధంగా కృషి చేయాలని ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ అన్నారు. నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలోని ఎస్‌పి ఛాంబర్ నుంచి పోలవరం, నూజివీడు, ఏలూరు సబ్ డివిజన్ల పరిధిలో ఉన్న ఎస్‌ఐలు, సిఐలతో జిల్లా ఎస్‌పి ప్రతాప్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ కేసుల్లో సాక్షులను సకాలంలో ప్రవేశపెట్టి నిందితులకు శిక్షలు పడేవిధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. దర్యాప్తును వేగవంతం చేసి కోర్టులో ఛార్జి సీట్లు పొందుపరచాలని సూచించారు. కోర్ట్ కానిస్టేబుల్ విధి నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్‌పి నక్క సూర్యచంద్రరావు, డిసిఆర్‌బి సిఐ హబీబ్ భాషా, మహిళా పోలీస్ స్టేషన్ సిఐ సుబ్బారావు, డిసిఆర్‌బి ఎస్‌ఐ రాజారెడ్డి, కోర్టు మానిటరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

రహదారిపై గోతులు పూడ్చివేత

ప్రజాశక్తి - కొయ్యలగూడెం


గోతులు పూడ్చిన అనంతరం రహదారి

కన్నాయగూడెం శివారు స్టాక్ పాయింట్ నుంచి పొంగుటూరు బ్రిడ్జ్ నిర్మాణానికి మెటీరియల్ తరలింపు కారణంగా పొంగుటూరు నుంచి కన్నాయగూడెం వరకు ఉన్న స్టేట్ హైవే దెబ్బతిన్న విషయంపై ప్రజాశక్తిలో కథనం ప్రచురితమైంది. ఈ కథనంపై స్పందించిన గ్రీన్‌ఫీల్డ్ అధికారులు వెంటనే చర్యలు చేపట్టి, రహదారిపై ఏర్పడిన గోతులను పూడ్చే పనులు ప్రారంభించారు.

ఆర్‌జియుకెటి స్టూడెంట్ వెల్ఫేర్‌గా డీన్ రాజేష్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఆర్‌జియుకెటి నూజివీడు క్యాంపస్ ఆంగ్ల శాఖలో ఒప్పంద అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఎల్.రాజేష్ డీన్ ఆఫ్ స్టూడెంట్ వెల్ఫేర్ (బాయ్స్)గా అదనపు బాధ్యతలు స్వీకరించారు. వీరు ఈ బాధ్యతలో ఒక సంవత్సరం పాటు కొనసాగుతారు. ఈ బాధ్యతను స్వీకరించిన డాక్టర్ రాజేష్ మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని, విద్యార్థులు ఉన్నతంగా ఎదగడానికి అనువైన పరిస్థితులు కల్పించడానికి కృషి చేస్తానని చెప్పారు. ఆర్‌జియుకెటి నూజివీడు క్యాంపస్ డైరెక్టర్, ఎపి రిజిస్ట్రార్ ఆచార్య సంద్ర అమరేంద్ర కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారంలో తగిన చొరవ చూపుతూ వారి ఉన్నతికి దోహదపడేలా పనిచేయాలని కోరుతూ డాక్టర్ రాజేష్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ డీన్ దువ్వూరి శ్రావణి, సెంట్రల్ ఎఒ బండి ప్రసాద్, నూజివీడు క్యాంపస్ పరిపాలనాధికారి బి.లక్ష్మణరావు, డీన్ ఎస్.చిరంజీవి, చీఫ్ వార్డెన్ బి.సురేష్‌బాబు, పూర్వ డీన్ ఆఫ్ స్టూడెంట్ వెల్ఫేర్ జాడ సీతాపతిరావు పాల్గొని డాక్టర్ రాజేష్‌కు అభినందనలు తెలిపారు.

దోమల మందు పిచికారీ

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి మలేరియా సబ్ యూనిట్ పరిధిలోని 18 ప్రభుత్వ సంక్షేమ వసతి గృహల్లో కీటక జనిత వ్యాధులకు గురి కాకుండా ముందస్తు చర్యల్లో భాగంగా మాలధియాన్ 25 శాతం ద్రావణం పిచికారీ చేసినట్లు చింతలపూడి మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎన్‌వి.ప్రసాద్ తెలిపారు. శనివారం చింతలపూడి ఎస్‌సి బాలుర వసతి గృహంలో పిచికారీ నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ అధికారులు, మలేరియా హెల్త్ అసిస్టెంట్ కె.శ్రీనివాస్, సంబంధిత ఎంఎల్‌హెచ్‌పిలు, విహెచ్‌ఎస్‌లు పాల్గొన్నారు.

గోపాలరావు మృతి తీరని లోటు

ప్రజాశక్తి - చింతలపూడి

అల్లం గోపాలరావు మృతి కళారంగానికి, వామపక్షాలకు తీరని లోటని సిపిఐ సీనియర్ నాయకులు మామిళ్లపల్లి వసంతరావు అన్నారు. అల్లం గోపాలరావు సంతాప సభ టివిఎస్.రాజు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వసంతరావు మాట్లాడుతూ గోపాలరావు మృతి చాలా బాధాకరమన్నారు. రేలారే రేలా అనే పాటతో ఆనాడు ఉర్రూతలూగించిన ప్రజా కళాకారుడు గోపాలరావు అని కొనియాడారు. ఈ సంతాప సభలో అరసం రాష్ట్ర కార్యదర్శి బిఎన్.సాగర్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల గురవయ్య, సిపిఐ మండల కార్యదర్శి తొర్లపాటి బాబు, సహాయ కార్యదర్శి దొంత కృష్ణ, మండల కమిటీ సభ్యులు పుల్లూరి సోమశేఖర్, ప్రజానాట్యమండలి కళాకారులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - ముసునూరు

రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆధ్వర్యంలో మండలంలోని గుడిపాడు గ్రామంలోని గ్రంథాలయంలో వాసన్ కంటి ఐ కేర్ హాస్పిటల్ విజయవాడ వారి సౌజన్యంతో ఆదివారం కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు టిడిపి తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దె రఘుబాబు తెలిపారు. కంటి పరీక్షలతో పాటు బిపి, షుగర్, డెంటల్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఎన్‌టిఆర్ వైద్య సేవ కార్డు ఉన్నవారికి కంటి ఆపరేషన్లు కూడా చేస్తారని, ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేస్తారన్నారు. మండలంలోని పలు గ్రామాల్లోని ప్రజలు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మృతుని కుటుంబానికి అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి అండగా నిలిచి దహన సంస్కారాలకు ఆర్థిక సాయం అందించారు. మండలంలోని విశ్వనాథునిపాలేనికి చెందిన గొల్లపల్లి సన్నీ(26) శుక్రవారం రాత్రి చోటు చేసుకున్న ప్రమాదంలో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న అంబుల వైష్ణవి తండ్రి ద్వారా ఆ కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. మృతునికి ఇద్దరు చిన్న కుమారులు, భార్య ఉన్నారు. మట్టి ఖర్చులు భరించలేని స్థితిలో కుటుబం ఉండి ఆర్థిక సహాయన్ని కోరగా వెంటనే అంబుల వైష్ణవి స్పందించి దహన సంస్కారాల నిమిత్తం రూ.ఐదు వేల నగదును తన తండ్రి డాక్టర్ మనోజ్ చేతులమీదుగా శనివారం మృతుని కుటుంబానికి అందించారు.


26న సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఈ నెల 26న మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ జి.నగరాజకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు దారబోయిన లక్ష్మీ అధ్యక్షతన సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని ఆమె తెలిపారు.

మహిళల స్వయం సమృద్ధి కోసం రుణాలు

వెలుగు ఎపిఎం ప్రభావతి



చిట్ చాట్

ప్రజాశక్తి - ఉంగుటూరు

పొదుపు సంఘాల కార్యకలాపాలు, స్వయం సహాయ సంఘాల సభ్యుల (డ్వాక్రా) బలోపేతం, కుటుంబ, వ్యాపార అవసరాల కోసం రుణాలు అందించేందుకు వీలుగా ప్రభుత్వం కొత్త విధానాలను అమలు చేస్తోంది. క్షేత్రస్థాయిలో అతివలు ఎంతవరకు లబ్ధి పొందుతున్నారనే దానిపై ఉంగుటూరు వెలుగు ఎపిఎం ప్రభావతి ప్రజాశక్తితో ముచ్చటించారు.

ప్రశ్న : మండలంలో ఎన్ని డ్వాక్రా సంఘాలు ఉన్నాయి. అందులో సభ్యులెందరు ఉన్నారు?

ఎపిఎం : 27 గ్రామ పంచాయతీల్లో 1952 స్వయం సహాయక సంఘాల్లో 19,520 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. వీరికి స్త్రీ నిధి, ఉన్నతి, బ్యాంక్ లింకేజ్ ద్వారా వివిధ రూపాల్లో పిల్లల విద్యావికాశానికి దోహదపడేందుకు నాలుగు శాతం (35 పైసలు) వడ్డీపై రుణాలు అందిస్తున్నాం.

ప్రశ్న : ప్రస్తుతం టార్గెట్ వివరాలు తెలియజేయగలరా?

ఎపిఎం : గతేదాడి రుణాల పంపిణీ లక్ష్యాలను పూర్తి చేశాం. ఈ ఏడాది స్త్రీనిధి రూ.ఎనిమిది కోట్లు, బ్యాంకు లింకేజ్ రూ.70 కోట్లు, ఉన్నతి రూ.పది కోట్ల వరకూ రుణ సాయం అందించేందుకు ప్రభుత్వ విధి విధానాలను అనుసరించి సర్వే చేస్తున్నాం. ప్రతి ఎనిమిది డ్వాక్రా సంఘాలకు ఎంపిక చేసిన ఒక యానిమేటర్ గ్రూపుల్లో సభ్యులకు ఎలాంటి రుణ సాయం కావాలనే వివరాలను అడిగి ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు. అలా యాప్‌లో చేసిన వివరాలు కమ్యూనిటీ క్లస్టర్‌ల (సీసీ) లాగిన్ నుంచి ఎపిఎం లాగిన్‌కు వస్తాయి. వాటిని పరిశీలించి నిబంధనలు అనుసరించి రుణ సాయానికి బ్యాంకర్లకు సిఫార్సు చేస్తున్నాం.

ప్రశ్న : విఒఎలు గ్రామ సంఘ (సహాయకులు) ఎంత మంది ఉన్నారు?

ఎపిఎం : మొన్నటివరకూ 54 మంది విఒఎలు ఉండగా కొత్తగా మరో ముగ్గురిని నియమించాం. ప్రతి డ్వాక్రా సంఘంలో పది మంది సభ్యులు కచ్చితంగా స్థానికం, ఒకే వీధి లేదా కాలనీకి చెందిన వారై ఉండాలి. గ్రూపు సభ్యులకు రికవరీ శాతం బట్టి రూ.25 లక్షలు నుంచి రూ.50 లక్షల వరకూ బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పిస్తున్నాం. ప్రస్తుతం ప్రతి సభ్యురాలి వివరాలను జియో ట్యాగింగ్ చేస్తున్నాం. అంటే గ్రూపులో సభ్యులందరూ కచ్చితంగా ఒకే ఏరియాలో ఉండాలి. లేకుండా జియోట్యాంగింగ్ అవ్వకపోతే ఎలాంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, రుణాలు రావు. అందుకే గ్రూపులో ఎవరైనా పొరుగూరు, ఇతర రాష్ట్ర, దేశాల్లో ఉంటే వారి బదులు కొత్తవారిని గ్రూపుల్లో చేర్చుకోవాలని మా సీసీలు, విఒఎల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం.

ప్రశ్న : విఒఎలుగా ఎవరిని నియమిస్తున్నారు?

ఎపిఎం : మార్గదర్శకాల ప్రకారం విఒఎలుగా నియమితులయ్యేవారు కచ్చితంగా ఆ డ్వాక్రా సంఘంలో సభ్యురాలై ఉండాలి. అలా లేనివారిని ఇటీవల కొంతమందిని తొలగించేశాం.

రక్తదానం ప్రాణదానంతో సమానం

పలుచోట్ల ఘనంగా ప్రపంచ రక్తదాన దినోత్సవం

ప్రజాశక్తి - ఉంగుటూరు


ఉంగుటూరు : రక్తదానం చేస్తున్న కమలకుమార్

ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని స్వచ్ఛందంగా అత్యధికంగా 33 సార్లు రక్తదానం చేసి సెకండరీ గ్రేడ్ ఉంగుటూరు మండలం కైకరానికి చెందిన ఉపాధ్యాయుడు, యుటిఎఫ్ నాయకుడు కూన కమల్‌కుమార్ రికార్డ్ సృష్టించారు. అంతే కాకుండా తనతో పాటు మిత్రులను రక్తదానంపై చైతన్య పరచి ఏలూరు తీసుకెళ్లి రక్తదానం చేయించిన కమల్ సేవలను అధికారులు అభినందించారు. కమల్‌కుమార్ మాట్లాడుతూ అన్నదానం ఆకలిని తీరిస్తే రక్త దానం ప్రాణాలను నిలుపుతుందన్నారు. తాను వీలైనంత వరకూ రక్త దానం చేస్తూనే ఉంటానన్నారు.

ఏలూరు సిటీ : రక్తదానం చేయడం వల్ల గుండెపోటు ఎప్పటికీ రాదని ఏలూరు యూత్ బ్లడ్ డోనర్స్ సంస్థ ఫౌండర్ శివరావు తెలిపారు. రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఏలూరులో పలుచోట్ల శనివారం రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శివరావు మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో ఆ రక్తం అవసరమైన ప్రతిఒక్కరికి ఏలూరు యూత్ బ్లడ్ డోనర్స్ సంస్థ అండగా ఉంటుందని తెలిపారు. ఈ సంస్థ ప్రారంభించినప్పటి నుంచి 796 మందికి అత్యవసర పరిస్థితుల్లో సమయానికి రక్తం అందించినట్లు తెలిపారు. అత్యవసర సమయంలో రక్తం అవసరమైనవారు 8247042084 సంప్రదించాలని తెలిపారు.

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం మొగళ్లపు నరసయ్య ప్రాంతీయ ప్రభుత్వాసుపత్రిలో రక్తదాన అవగాహనా ర్యాలీ, స్వచ్ఛంద సేవా సంస్థల వారికి, రక్తదాతలకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ బేబీ కమల, హెచ్‌డిఎస్ కమిటీ మెంబర్లు మాట్లాడారు. జంగారెడ్డిగూడెం ప్రభుత్వాసుపత్రిలో ఉన్న బ్లడ్ బ్యాంక్ సదుపాయాన్ని అందరూ ఉపయోగించుకుని రక్తదానం చేసి, ఎవరికైనా అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైనప్పుడు రక్తాన్ని ఇక్కడి నుంచి తీసుకెళ్లొచ్చని, దీంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న ప్రతిఒక్కరూ రక్త సేవలు పొందొచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రిలోని వైద్యులు, వైద్యేతర సిబ్బంది, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కంచర్ల గణేష్, నాయుడు శ్రీనివాస్, డి.వెంకటలక్ష్మి (రాజీ), ప్రమీల పాల్గొన్నారు.


జంగారెడ్డిగూడెం : అవగాహనా ర్యాలీ

16న సర్టిఫికెట్ల ధ్రువీకరణ

ఆర్‌జియుకెటి అడ్మిషన్ల కన్వీనర్ అమరేంద్ర

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఆర్‌జియుకెటిలో 2025-26 విద్యాసంవత్సరానికి ఇంటిగ్రేటెడ్ బీటెక్ (ఇంటర్ ఇంజనీరింగ్) ప్రోగ్రామ్ కోసం దరఖాస్తు గడువును ఈ నెల రెండో తేదీ నుంచి పదో తేదీ వరకు పొడిగించిన నేపథ్యంలో, ఆ గడువు విస్తరణ సమయంలో క్యాప్, క్రీడలు, ఎన్‌సిసి, భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ వంటి ప్రత్యేక కేటగిరీలకు దరఖాస్తు చేసిన అభ్యర్థుల సర్టిఫికెట్ ధ్రువీకరణ కార్యక్రమం ఈ నెల 16వ తేదీ సోమవారం నుజివీడు క్యాంపస్‌లోని ఎస్‌ఎసి భవనంలో నిర్వహించనున్నట్లు ఆర్‌జియుకెటి అడ్మిషన్ల కన్వీనర్, ప్రొఫెసర్ ఎస్.అమరేంద్ర తెలిపారు. ఇందులో భాగంగా పైపేర్కొన్న ప్రత్యేక కేటగిరీలకు గతంలో దరఖాస్తు చేసుకుని ధ్రువీకరణకు హాజరు కాలేకపోయిన అభ్యర్థులు కూడా 16న నిర్వహించే ధ్రువీకరణకు హాజరయ్యేందుకు అవకాశం కల్పించినట్లు చెప్పారు. ఈ ధ్రువీకరణ కార్యక్రమం ప్రత్యేక కేటగిరీలకు సంబంధించి తుది అవకాశం అవుతుందనే అంశాన్ని అభ్యర్థులు గమనించాలని తెలిపారు.

లోకేష్‌ను కలిసిన వీరమల్లు

ప్రజాశక్తి - ముదినేపల్లి

విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌ను శనివారం కైకలూరు నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా తల్లికి వందనం పథకం ద్వారా అర్హులైన విద్యార్థులు తల్లులకు నిధులను సకాలంలో విడుదల చేసినందుకు లోకేష్‌కు నరసింహారావు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - భీమడోలు

ట్రాన్స్ కో భీమడోలు సెక్షన్ పరిధిలోని వివిధ 33/11 కెవి సబ్ స్టేషన్ల పరిధిలోని 11 కెవి ఫీడర్ల లైన్లకు అడ్డుగా ఉన్న చెట్టు కొమ్మల తొలగింపు, విద్యుత్ మరమ్మతులు, నూతన లైన్ల ఏర్పాటు చేయటం తదితర కార్యక్రమాల కారణంగా ఈ నెల 15వ తేదీ ఆదివారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్ కో ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అంబేద్కర్ తెలిపారు. దీనిలో భాగంగా మండల పరిధిలోని భీమడోలు, సూరప్పగూడెం, అంబర్‌పేట, గుండుగొలను, ఆగడాలలంక సబ్ స్టేషన్ల పరిధిలోని వివిధ గ్రామపంచాయతీలు, అనుబంధ ఆవాస గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. కేవలం పూళ్ల 33/11 కెవి పరిధిలోని పూళ్ల, కురెళ్లగూడెం గ్రామ పంచాయతీలతో పాటు, అనుబంధ ఆవాస గ్రామాలకు విద్యుత్ కోత ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నిరుపయోగంగా మినీ బస్టాండ్

వినియోగంలోకి తీసుకురావాలని ప్రజల వేడుకోలు



నిరుపయోగంగా ఉన్న మినీ బస్టాండ్

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి నగర పంచాయతీలో లక్షల రూపాయాలతో నిర్మించిన మినీ బస్టాండ్ నిరుపయోగంగా మారింది. బస్టాండ్‌ను ఎప్పుడు ఉపయోగిస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడంలేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లే సమయంలో ఎండలో, వర్షంలో ఉండాల్సిన పరిస్థితి నెలకొంటుందని వాపోతున్నారు. చిన్నారులు, వృద్ధులకు కూడా అవస్థలు తప్పడంలేదు. లక్షల రూపాయాలు ఖర్చు చేసి నిర్మించిన బస్టాండ్ ఎందుకు ఉపయోగించడంలేదని ప్రజా సంఘల నాయకులు ప్రశ్నిస్తున్నారు. మాజీ ఎంపీ కావూరి సాంబశివరావు హయంలో నిర్మించిన మినీ బస్టాండ్ ఇప్పటివరకు ప్రయాణికులకు ఉపయోగించని పరిస్థితి. సుమారు రూ.90 లక్షల ఎంపీ నిధులతో మినీ బస్టాండ్‌ను నిర్మించారు. నగర పంచాయతీలో ప్రభుత్వ కార్యాలయాలు ఉండడంతో అనేక మంది చింతలపూడికి వస్తూ, వెళ్తుంటారు. చింతలపూడి పాత బస్టాండ్ వద్ద ఉన్న మినీ బస్టాండ్‌ను ఉపయోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

తోటరామచంద్రపురంలో తాగునీటి సమస్య

నాలుగేళ్లుగా తరచూ ఇబ్బందులు
అధికారులకు గ్రామస్తుల ఫిర్యాదు

ప్రజాశక్తి - ఉంగుటూరు


ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

కాకర్లమూడి పంచాయతీ పరిధి తోటరామచంద్రపురం (టిఆర్‌సి పురం)లో తాగునీటి సమస్య ఉన్నా పట్టించుకోవడం లేదని ఎంపిటిసి సభ్యురాలు కూనా మణి పోతురాజు ఇటీవల జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. టిఆర్‌సి పురంలో సుమారు 250 మంది జనాభా ఉన్నారు. గ్రామంలో చెరువు తూడు, తామరాకులతో దట్టంగా పేరుకుపోయింది. ఉంగుటూరు సిపిడబ్ల్యు పంపింగ్ స్కీమ్ ద్వారా పైపు మార్గం ద్వారా టిఆర్‌సి పురానికి రక్షిత తాగునీటిని పంపిణీ చేయడంలోనూ అనేక సమస్యలు ఉంటున్నాయి. ఇటీవల రావులపర్రు, కోనాల ఆర్‌అండ్‌బి రోడ్డు మధ్యలో కల్వర్టు నిర్మిస్తుండగా జెసిబి వల్ల పైపులైను దెబ్బతిని నీరు వెళ్లడంలేదు. మరో పక్క చెరువు ఫిల్టర్‌బెడ్స్ పనిచేయక చెరువు నీరు శుద్ధి కావడం లేదు. చెరువు నీరు, పైపు ద్వారా నీరు అందకపోవడంతో జనాలు కిలోమీటర్ల దూరం వెళ్లి డబ్బాలతో కాకర్లమూడి నుంచి నీటిని తెచ్చుకోవాల్సి వస్తోంది. ఫిల్టర్ బెడ్స్ మరమ్మతుల కోసం నిధుల కేటాయించమని నాలుగేళ్ల నుంచి కోరుతున్నా మండల పరిషత్ అధికారులు స్పందించలేదని ఎంపిటిసి సభ్యురాలు కూనా మణిపోతురాజు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్తులు సైతం ఉంగుటూరులో ఎంపిడిఒ, ఆర్‌అండ్‌బి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ముందుగా చెరువు శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లించి ఆరబెట్టి నీటితో నింపేలా చర్యలు తీసుకున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ రామారావు చెప్పారు. చిన్న గ్రామం కారణంగా చెరువు నీటిని వినియోగించకుండా సిపిడబ్ల్యూ స్కీమ్ నీటినే జనాలు వాడుతున్నారు. ఫిల్టర్‌బెడ్స్ గత పదేళ్లుగా పనిచేయడంలేదు. మండల పరిషత్ నిధులతో వాటికి మరమ్మతులు చేయిస్తామని ఎఇ చెప్పారు.

టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమంపై నమ్మకంతో వైసిపి 40 మంది కార్యకర్తలు తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకున్నారని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. వైసిపి నూజివీడు ఎంపిపి ఎ.శిరీష, 40 మంది ఆ పార్టీ కార్యకర్తలు శనివారం మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి కొలుసు పార్థసారథి సమక్షం లో తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి మంత్రి టిడిపి కండువా కప్పి సాదారంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను, సూపర్ సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా నెరవేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'యోగాతో సంపూర్ణ ఆరోగ్యం'

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం మండలంలోని పలు సచివాలయాలలో పంచాయతీ, సచివాలయ, హెల్త్ సిబ్బంది, అంగన్వాడీ, ఉపాధి హామీ కూలీలతో యోగా డెమో నిర్వహించినట్లు ఎంపిడిఒ నిఖిల్ మధు శరణ్ తెలిపారు. యోగా ప్రాముఖ్యతను తెలియచెప్పేందుకు రాష్ట్ర ప్రభుత్వం నెల రోజులపాటు యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. దీనిలో భాగంగా మండల పరిధిలోని సిబ్బందితో సామూహిక సన్నద్ధత యోగా చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు సున్నం ఉషారాణి, పార్వతి, జగదాంబ, జగ్గారావు, రాంబాబు, ఎంపిటిసిలు నాలి శ్రీను, సున్నం సురేష్, పంచాయతీ, సచివాలయ, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : మండలంలోని వేగవరం హై స్కూల్‌లో యోగాంధ్రలో భాగంగా అభ్యాసన కార్యక్రమంలో యోగాసనాలు వేయించారు. సర్పంచి లక్కాబత్తుల నాగరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రటరీ, విఆర్‌ఒ, హెల్త్ అసిస్టెంట్, వార్డ్ మెంబర్, లక్కాబత్తుల వెంకటరమణ పాల్గొన్నారు.

మండవల్లి : యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామదుర్గ ప్రసాద్ స్పష్టం చేశారు. అంతర్జాతీయ యోగాను పురస్కరించుకుని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొని యోగాసనాలను వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కె.రామలింగే శ్వరరావు, సర్పంచి మెండ ఝాన్సీ సురేష్, అంగన్వాడీలు, ఆశా వర్కర్లు, ఐకెపి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు : యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఎంపిడిఒ బసవరాజు అచ్యుత సత్యనారయణ అన్నారు. మండలంలోని వేల్పుచర్ల గ్రామం జిల్లా పరిసత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులతో పాటు గ్రామంలోని పలువురు పెద్దలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గరికిముక్క నాని, గ్రామ పంచాయితీ శాఖాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

టి.నరసాపురం : యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఎంపిడిఒ జి.నగరాజకుమారి తెలిపారు. మండలంలో శనివారం అన్ని పంచాయతీల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మోదుగు సునంద, డిప్యూటీ తహశీల్దార్ స్రవంతి, ఎఒ జి.మణికుమారి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

'నిరుపేదలకు అండగా సిఎంఆర్‌ఎఫ్'

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

అపత్కాలంలో నిరు పేదలకు మెరుగైన వైద్యం అందించడంలో సిఎంఆర్‌ఎఫ్ అండగా నిలుస్తుందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. గుడిమెట్ల గ్రామానికి చెందిన ఎ.పావని కుటుంబానికి రూ.50 వేల ఎల్‌ఒసి పత్రాన్ని మంత్రి అందించారు. పావని అనారోగ్యంతో బాధపడుతుందని, విజయవాడలో ఒక ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుందని, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, సాయం చేయాలని బాధిత కుటుంబసభ్యులు మంత్రి కొలుసు పార్థసారథి దృష్టికి తీసుకెళ్లారు. శనివారం మెరుగైన చికిత్స నిమిత్తం సిఎం సహాయనిధి నుంచి రూ.50 వేల ఎల్‌ఒసి మంజూరు పత్రాలను కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా మంత్రికి బాధిత కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.